సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

బుధవారం । 13 । మార్చి । 2024



గుణాత్మక విద్య అందించాలి

గిరిజన విద్యార్థులకు గుణాత్మకమైన విద్యను అందించాలని ఐటీడీఏ పీవో అభిషేక్ సూచించారు. 8లో



చేయూతతో ఆర్థిక బలోపేతం

చేయూత మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసిందని పాడేరు, రంపచోడవరం ఎమ్మెల్యేలు భాగ్యలక్ష్మి, ధనలక్ష్మి పేర్కొన్నారు. 8లో



ఘనంగా అష్టదళ పద్మారాధన

విశాఖ: నగరంలోని కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు.

న్యూస్‌రీల్

శతశాతం ఉత్తీర్ణత సాధించండి

- కలెక్టర్ విజయ సునీత



గుత్తులపుట్టు ఆశ్రమంలో బాలికలతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ సునీత

సాక్షి,పాడేరు: ఈఏడాది టెన్త్ పరీక్షల్లో విద్యార్థులంతా శతశాతం ఉత్తీర్ణత సాధించాలని కలెక్టర్ విజయసునీత సూచించారు. మంగళవారం రాత్రి ఆమె తలారిసింగి గుత్తులపుట్టు బాలికల ఆశ్రమ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. టెన్త్ విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థుల సామర్థ్యం, బోధనపై సమీక్షించారు. విద్యార్థులకు సిద్ధం చేసిన ఆహారాన్ని, మెనూను పరిశీలించారు. మంచి మార్కులు సాధించాలన్న లక్ష్యంతో పరీక్షలు రాయాలని విద్యార్థులకు ఆమె సూచించారు. ఏటీడబ్ల్యూవో ఎల్.రజని పాల్గొన్నారు.

వైద్య కళాశాలలో నియామకాలు



నియామక పత్రాలు అందజేస్తున్న ప్రిన్సిపాల్

సాక్షి,పాడేరు: పాడేరు మెడికల్ కళాశాల, బోధన ఆస్పత్రిలో అవుట్ సోర్సింగ్,కాంట్రాక్ట్ పద్ధతిపై పదిమందిని నియమించారు. భర్తీ చేయనున్న 256 పోస్టులకు సంబంధించి మెరిట్ ద్వారా పలు విభాగాల్లో నియమితులకు మంగళవారం రాత్రి జిల్లా సర్వజన ఆస్పత్రిలో ఉత్తర్వులు అందజేసినట్టు ప్రిన్సిపాల్ హేమలతాదేవి తెలిపారు. మిగిలిన పోస్టుల భర్తీ త్వరితంగా పూర్తిచేస్తామన్నారు.

గ్రామసచివాలయ భవనం ప్రారంభం



సొలభంలో గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి


జి.మాడుగుల: మండలంలో సొలభం-1గ్రామ సచివాలయం నూతన భవనాన్ని మంగళవారం పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ప్రారంభించారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తుకు మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పీఆర్ ఏఈ మాణిక్యం, సర్పంచ్ ఐసరం హనుమంతరావు, ఎంపీటీసీ చిన్నారావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మత్స్యకొండంనాయుడు, జేసీఎస్ కన్వీనర్ కళ్యాణం పాల్గొన్నారు.

నాటు తుపాకులు అప్పగించండి

- రంపచోడవరం, చింతూరు ఏఎస్పీలు జగదీష్ అడహళ్లి, రాహుల్‌మీనా

రంపచోడవరం/చింతూరు: అనుమతి లేకుండా తుపాకులు, నాటు తుపాకులు కలిగి ఉంటే తక్షణమే స్వచ్ఛందంగా వారి పరిధిలోని పోలీస్ స్టేషన్‌ల్లో అప్పగించాలని రంపచోడవరం ఏఎస్పీ జగదీష్ అడహళ్లి, చింతూరు ఏఎస్పీ రాహుల్‌మీనా ఒక ప్రకటనలో కోరారు. జిల్లా కలెక్టర్ అనుమతి లేకుండా తుపాకులు, నాటు తుపాకులు కలిగి ఉండటం చట్టరీత్యా నేరమన్నారు. వాటిని వారం రోజుల్లోగా సమీప పోలీసుస్టేషన్లలో అప్పగించాలని తెలిపారు. లేకుండా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఇరువురు హెచ్చరించారు. అలాగే అక్రమంగా ఆయుధాలు కలిగి ఉన్న వారి సమాచారం ఇచ్చిన వారికి నగదు బహుమతి ఇవ్వబడుతుందన్నారు. సమాచారం తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఏఎస్పీ పేర్కొన్నారు.

రికార్డుల్లేని వాహనాలకు రూ.53 వేల జరిమానా



వాహన రికార్డులను పరిశీలిస్తున్న ఆర్టీవో

అడ్డతీగల: రికార్డులు సక్రమంగా లేని వివిధ వాహనాలకు రూ.53 వేల జరిమానా విధించినట్టు రంపచోడవరం ఆర్టీవో ఆర్.రాజేశ్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన అడ్డతీగల, వేటమామిడి సెంటర్లలో వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వాహనాలకు రికార్డులను తనిఖీ జరిమానా విధించారు.వాహన యజమానులకు కౌన్సెలింగ్ నిర్వహించారు.

వైఎస్సార్‌సీపీతోనే సంక్షేమం, అభివృద్ధి

- ఈ సారీ జగనన్నే ముఖ్యమంత్రి
- పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధం
- పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి
- కంఠారంలో వైఎస్ విగ్రహావిష్కరణ
- వాడవాడలా ఘనంగా పార్టీ ఆవిర్భావ దినోత్సవం



కంఠారంలో వైఎస్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, వైఎస్సార్‌సీపీ శ్రేణులు

కొయ్యూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని, అందుకు తగ్గట్టుగా పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి అన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం కంఠారంలో నిర్మించిన దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని, జెండాను పార్టీ శ్రేణుల సమక్షంలో ఆమె ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆమె మాటాడుతూ రానున్న ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో విజయం సాధించి జగనన్న ప్రభుత్వాన్ని ఏర్పాటుచేస్తారని సీఎంగా రెండోసారి ప్రమాణ స్వీకారం చేస్తారన్నారు. ప్రజలంతా తమ పార్టీ వైపు ఉన్నారన్నారు.విపక్షాలు ఎన్ని కుట్రలు పన్నినా ఫలించవన్నారు. ప్రతీ ఒక్కరు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి జగనన్నకు అండగా నిలవాలని ఆమె కోరారు. ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఏకైన ముఖ్యమంత్రి జగన్ అని అన్నారు. ఎంపీపీ బడుగు రమేష్, జెడ్పీటీసీ వారా నూకరాజు, వైస్ ఎంపీపీలు అప్పన వెంకటరమణ, అంబటి నూకాలు, మాజీ పీఏసీఎస్ పర్సన్ ఇంచార్జీ గజ్జయ్యదొర, ఏఎంసీ చైర్మన్ రాజులమ్మ, సుధాకర్, పార్టీ మండల అధ్యక్షుడు జల్లి బాబులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు సత్కారం

డుంబ్రిగుడ (అరకులోయ టౌన్): వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి అంకితభావంతో పనిచేసి ఉత్తమ సేవలందించిన పార్టీ నేతలను ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మంగళవారం సత్కరించారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం అరకు సంతబయలులో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి పంచాయతీల పరిధిలో పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేసిన శ్రేణులను ఎన్నటికీ మరువలేమన్నారు. ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా పార్టీని నమ్ముకొని జగన్ మోహన్ రెడ్డి వెంటే ఉన్నారన్నారు. అటువంటి సీనియర్ నాయకులు ఎంత చేసినా తక్కువే అన్నారు. అరకులోయ, డుంబ్రిగుడ మండలాలకు చెందిన బుర్జ సుందర్‌రావు, వంతాల సద్దు, శ్రీరాములు, మధు, వి. వరహాలను ఎమ్మెల్యే శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ చటారి జానకమ్మ, ఎంపీపీ బాకా ఈశ్వరి, ఎంపీటీసీ జమ్మి, వైస్ ఎంపీపీలు ఆనంద్, లలిత, మాజీ సర్పంచ్ పాంగి చిన్నారావు, మండల పార్టీ అధ్యక్షుడు చిక్కుడు మల్లేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్ సద్దు, సర్పంచ్ గుమ్మ నగేష్, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీ నేతలను సత్కరించిన అరకు ఎమ్మెల్యే పాల్గుణ



వంతెన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పాల్గుణ



ముంచంగిపుట్టులో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర



పోలవరంలో కేక్ కట్ చేస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి

జగనన్న వెంటే జనం

ముంచంగిపుట్టు: ముఖ్యమంత్రి జగనన్న వెంటే జనం ఉన్నారని మళ్లీ ఎన్ని కూటమిలు వచ్చినా వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం ఖాయమని ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నాలుగు రోడ్ల కూడలిలోని వైఎస్ విగ్రహనికి ఆమె పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జై జగన్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ జన హృదయ నేత మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపడతారన్నారు. సంక్షేమం, అభివృద్ధిపథంలో గిరిజన గ్రామాలు ముందుకు పోతున్నాయని, 2024లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయం లక్ష్యంగా అందరూ పనిచేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అరిసెల సీతమ్మ, వైస్ ఎంపీపీ భాగ్యవతి, సర్పంచ్‌లు నీలకంఠం, గంగాధర్, బాబూరావు, ఎంపీటీసీలు కమల, కొండమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జగబంధు పాల్గొన్నారు.

ఎటపాక: మండలంలోని కన్నాయిగూడెంలోని పోలవరంలో మంగళవారం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసమే పార్టీ ఏర్పాటైందన్నారు. ఎంపీపీ కాక కామేశ్వరి, జెడ్పీటీసీ ఉబ్బా సుస్మిత, పార్టీ మండల కన్వీనర్ తానికొండ వాసు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో గిరి గ్రామాలు : అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

డుంబ్రిగుడ (అరకులోయ టౌన్): వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గిరి గ్రామాలు అభివృద్ధి పథంలో నడుస్తున్నాయని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మంగళవారం మండలంలోని గసభ పంచాయతీ లోగిలిలో రూ.1.80 కోట్లతో నిర్మించిన వంతెనను ఆయన ప్రారంభించారు. గసభ, కొల్లాపూట్, సావ్వా పంచాయతీ ప్రజలతోపాటు ఒడిశా రాష్ట్ర ప్రజలకు అంతర్రాష్ట్ర రాకపోకలకు, రైతుల వ్యవసాయోత్పత్తులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి మరలా రూ. 40 లక్షలు మంజూరు చేసినట్టు చెప్పారు. మరో నెల రోజుల్లో ఈ పనులు పూర్తి చేస్తామన్నారు. గసభ ఎంపీటీసీ జమ్మి, పార్టీ నేతలు డప్పువాయిద్యాలు, థింసా నృత్యాలతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యేకు పూలమాలలు వేసి సత్కరించారు. ట్రైబల్ వెల్ఫేర్ ఏఈఈ అభిషేక్, జెడ్పీటీసీ చటారి జానకమ్మ, ఎంపీపీ బాకా ఈశ్వరి, సర్పంచ్ సునీత, వైస్ ఎంపీపీలు ఆనంద్, లలిత, మాజీ సర్పంచ్ పాంగి చిన్నారావు, మండల పార్టీ అధ్యక్షుడు చిక్కుడు మల్లేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్ సద్దు, సర్పంచ్ గుమ్మ నగేష్ పాల్గొన్నారు.



అరకులో వైఎస్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అరకు అసెంబ్లీ సమన్వయకర్త మత్స్యలింగం



పాడేరులో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ పాడేరు సమన్వయకర్త విశ్వేశ్వరరాజు

టీడీపీ సోషల్ మీడియా వల్లే గీతాంజలి ఆత్మహత్య



పాత బస్టాండ్ వద్ద కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి

- మానసికంగా వేధించడంతోనే బలవన్మరణం
- ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ఆవేదన
- పాడేరులో కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ
- ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం

పాడేరు : టీడీపీ సోషల్ మీడియా ట్రోలింగ్ వల్లే తెనాలికి చెందిన గీతాంజలి అనే మహిళ మానసిక వేదనకు గురై ఆత్మహత్య చేసుకుందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. మంగళవారం రాత్రి పాడేరు పట్టణంలో పాత బస్టాండ్ వద్ద కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ చేపట్టి నిరసన తెలిపారు. గీతాంజలి ఆత్మకు శాంతి చేకూరాలని కొద్దిసేపు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆమె ఎదుర్కొన్న పరిస్థితి మరే మహిళకు రాకూడదన్నారు. నవరత్నాల పథకాల్లో ఒకటైన పేదల సొంతింటి కలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారని ఇందులో భాగంగా గీతాంజలి అనే మహిళకు కూడా సొంతిల్లు వచ్చిందన్నారు. ఆ సమయంలో తన ఆనందాన్ని మీడియాతో పంచుకున్న గీతాంజలిపై టీడీపీ సోషల్ మీడియా ట్రోల్ చేస్తూ ఆమెను మానసికంగా హింసించారని చెప్పారు. అందువల్లనే ఆమె మానసిక వేదనకు గురై ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. టీడీపీ సోషల్ మీడియా వికృత చేష్టలు తారాస్థాయికి చేరాయన్నారు. గీతాంజలి ఆత్మహత్యకు కారణమైన వ్యక్తులను గుర్తించి కఠినంగా శిక్షించాలని ఆమె డిమాండ్ చేశారు. గీతాంజలి మృతితో అనాథలైన ఇద్దరు ఆడపిల్లలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రూ.20లక్షల పరిహారం ప్రకటించి మానవత్వాన్ని చాటుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జీకే వీధి జెడ్పీటీసీ సభ్యురాలు కిముడు శివరత్నం, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్‌పర్సన్ ఎం. సరస్వతి, వైస్ ఎంపీపీ కుంతూరు కనకాలమ్మ, పీఏసీఎస్ చైర్‌పర్సన్ లకే రామసత్యవతి, ఎంపీటీసీ సభ్యురాలు గిడ్డి విజయలక్ష్మి, పార్టీ మండల అధ్యక్షుడు రాంబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి మంగ్లన్నదొర, ఎంపీటీసీలు సన్యాసిరావు, రామకృష్ణ పాత్రుడు, నర్సింహమూర్తి, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

మాకవరంలో దొంగల బీభత్సం

- మారణాయుధాలతో తలుపులు బద్దలు కొట్టి చొరబడిన దుండగులు
- రూ.2.10 లక్షలు, నాలుగున్నర తులాల బంగారు ఆభరణాలు దోపిడీ



బాధితుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న సీఐ రమేష్

ముంచంగిపుట్టు: మండలంలోని మాకవరంలో సోమవారం రాత్రి దోపిడీ దొంగలు బీభత్సం సృష్టించారు. తలుపులను మారణాయుధాలతో బద్దలగొట్టి ఇంటిలోకి చొరబడ్డారు. నగదు, బంగారు ఆభరణాలను పట్టుకుని పోయారు. మాకవరంలో పాంగి సతీష్‌కు చెందిన దుకాణం, ఇంటిలో సోమవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. సుజనకోటలో జరుగుతున్న గంగమ్మతల్లి జాతరకు కిరాణా సరుకులు అమ్మకం నిమిత్తం సతీష్ వెళ్లారు.దీనిని గమనించిన దుండగులు అర్ధరాత్రి వ్యాన్‌లో వచ్చి కత్తులు, నాటు తుపాకీలతో సతీష్ దుకాణం, ఇంటి తలుపులు బద్దలు గొట్టి లోపలకు ప్రవేశించారు. ఇంట్లో నిద్రిస్తున్న సతీష్ భార్య లక్ష్మి, ముగ్గురు పిల్లల మెడపై కత్తి పెట్టి బెదిరించారు. వారితో బీరువాలు తెరిపించారు. అందులో ఉన్న రూ.2.10 లక్షల నగదు, నాలుగున్నర తులాల బంగారం ఆభరణాలను పట్టుకు పోయారు. సతీష్ ఇల్లు, కలిసున్న దుకాణం గ్రామానికి కాస్త దూరంగా ఉన్నందున సులువుగా దోపిడీకి పాల్పడ్డారు. వారు వెళ్లిపోయిన అనంతరం లక్ష్మి కేకలు వేస్తూ గ్రామంలోకి వెళ్లి అందరినీ మేల్కొలిపింది. ఈమేరకు సతీష్, లక్ష్మి మంగళవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దొంగతనం చేసేందుకు వచ్చిన దుండగులు సుమారు 10 మంది వరకు ఉన్నారని, అందరి వద్ద కత్తులు, నాటు తుపాకులు ఉన్నాయని వారు వివరించారు. ఒడిశాకు చెందిన వారు కావొచ్చని బాధితులు పోలీసులకు వివరించారు. జి.మాడుగుల సీఐ రమేష్ సిబ్బందితో దొంగతనం జరిగిన ఇంటిని పరిశీలించారు. ఇలావుండగా ఒడిశాకు చెందిన ముఠాసభ్యులు దారికాచి దోపిడీకి పాల్పడుతున్నట్టు సరిహద్దు గ్రామాల గిరిజనులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇటీవల జోలాపుట్టు వద్ద ఒక కాంట్రాక్టర్‌కు కత్తులు చూపించి రూ.5వేలు దోచుకున్నట్టు గ్రామస్తులు తెలిపారు.

జగనన్న హయాంలోనే 'అరకు' అభివృద్ధి

- చంద్రబాబు హయాంలో సవతితల్లి ప్రేమ
- అభివృద్ధికి అధిక ప్రాధాన్యమిచ్చిన ముఖ్యమంత్రి జగన్
- జిల్లా ఆస్పత్రికి అనుబంధంగా పాడేరులో వైద్య కళాశాల నిర్మాణం
- పర్యాటక రంగానికి పూర్తిస్థాయిలో నిధుల కేటాయింపు
- అభివృద్ధి, సంక్షేమానికి రూ.3 వేల కోట్లు: ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ
- తప్పుడు కథనాలతో అక్కసును వెళ్లగక్కిన ఈనాడు దినపత్రిక



అరకు అంజోడ స్కిల్‌ఫాం వద్ద పైనరీ పార్కు



బొర్రాలో గోస్తనిపై ఏర్పాటుచేసిన జిప్‌లైన్



అనంతగిరి: జిల్లాలో పర్యాటకంగా ప్రత్యేకత సంతరించుకున్న అరకు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేసింది. అయితే ఈనాడు దినపత్రిక తన అక్కసును మరో సారి వెళ్లగక్కింది. గత టీడీపీ ప్రభుత్వం ఈప్రాంత అభివృద్ధిపై పట్టించుకోలేదు. గత ఎన్నికల్లో పాడేరు, అసెంబ్లీ నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు గెలుపొందారు. అందుకు తగ్గట్టుగానే ఏజెన్సీ అభివృద్ధికి అధిక నిధులు వెచ్చించి అభివృద్ధి చేసింది.

చంద్రబాబు సవతితల్లి ప్రేమ

గత ప్రభుత్వంలో అరకువేలీ మండలంలోని పెదలబుడు పంచాయతీని దత్తత తీసుకున్న చంద్రబాబు సవతి తల్లి ప్రేమను చూపించారు. ఐదేళ్లకాలంలో ఆయన ఏ ఒక్క పని పూర్తి చేయలేదు. కనీస సౌకర్యాలైన సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం, వీధి దీపాల ఏర్పాటు కూడా చేపట్టలేకపోయారు. పెదలబుడు వద్ద వంతెన నిర్మాణం పూర్తికాలేదు. పర్యాటక రంగ అభివృద్ధిని పూర్తిగా విస్మరించారు.

అన్నివిధాలా అభివృద్ధికి కంకణం

రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అందాల అరకులోయను అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు ప్రణాళికపరంగా చర్యలు చేపట్టింది. నియోజకవర్గంలో రూ.1500 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టింది. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పెద్ద ఎత్తున రహదారులు, వంతెనలను నిర్మించింది. సుమారు రూ.100 కోట్లు వెచ్చించి గిరిజనుల కష్టాలను తీర్చింది. మంచంగిపుట్టు మండలంలోని రంగబయలు, బుంగాపుట్టు, బూసిపుట్టు పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో సుమారు రూ.56 కోట్లతో రహదారులు, వంతెనల నిర్మాణం పూర్తి 75 ఏళ్ల నాటి సమస్యలను పరిష్కరించింది.

నిరుద్యోగ యువతకు శిక్షణ, ఉపాధి

నియోజకవర్గంలో నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాల కల్పన కోసం రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇందుకోసం నియోజకవర్గ కేంద్రమైన అరకువేలిలో స్కిల్ కళాశాల నెలకొల్పింది. ప్రధానంగా యువతకు టూరిజం, ఆస్పలిటీ, ఫుడ్ అవుట్ లెట్, హౌస్ కీపింగ్ ఇతర రంగాల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తోంది.అనంతరం ప్రత్యేక జాబ్‌మేళా నిర్వహించి, తెలుగు రాష్ట్రాలతోపాటు ఇతర ప్రాంతాలకు చెందిన ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కలిస్తోంది. 150 మందికి శిక్షణ ఇచ్చి, 81 మంది ఉద్యోగాలు కల్పించింది.

పర్యాటక రంగానికి అధిక ప్రాధాన్యం

పాడేరు ఐటీడీఏ ఆధ్వర్యంలో పర్యాటక ప్రాంతాల్లో సందర్శకులకు అవసరమైన సౌకర్యాల్య కల్పించింది. చాపరాయి జలపాతాన్ని పర్యాటకుల మదిని దోచేలా రూ.50 లక్షలతో ఆధునీకీకరించింది. అరకులోయ గిరిజన మ్యూజియాన్ని రూ.50 లక్షలతో గిరిజన సంప్రదాయం అద్దంపట్టేలా సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దింది. బొర్రాగుహల వద్ద గోస్తనీ అందాలను తిలకించేలా పర్యాటకశాఖ ఆధ్వర్యంలో రూ.65 లక్షలతో జిప్‌లైన్ ఏర్పాటు చేశారు.



5.5 కోట్లతో నిర్మిస్తున్న సీతాకోక చిలుక ప్రాజెక్టు


నూతన ప్రాజెక్టులు..

అనంతగిరి మండలం మర్రిగుడ సమీపంలోని చాపరాయి వద్ద రూ.5.5 కోట్లతో చేపట్టిన సీతాకోక చిలుక పార్కు పనులు శరవేగంగా సాగుతున్నాయి. వీఎస్ఎస్ పరిధిలోగల 60 కుటుంబాలకు జీవనోపాధి కల్పించేలా ఈ ప్రాజెక్టు నిర్మాణం జరుగుతోంది. అరకు-విశాఖ ప్రధాన రహదారి అనంతగిరి మండలం చిలకలగెడ్డ వద్ద ఎకో టూరిజం పార్కును అభివృద్ధి చేసింది. అరకులోయ జైపూర్ జంక్షన్ వద్ద సెంట్రల్‌వేర్ హౌసింగ్ కార్పొరేషన్ సహకారంతో రూ.70 లక్షలతో నిర్మించిన పైనరీ పార్కు పర్యాటకులను మంత్ర ముగ్ధులను చేస్తోంది.

పరిపాలన సౌలభ్యం కోసం..

పాడేరు, అరకు, రంపచోడవరం నియోజకవర్గాలకు పాడేరు కేంద్రంగా ప్రభుత్వం ప్రత్యేక జిల్లాను ఏర్పాటుచేసింది. ఈనాడు పత్రిక మాత్రం కల్పిత కథనాలు ప్రచురిస్తూ, మరింత దిగజారిపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అరకులో అనువైన ప్రభుత్వ స్థలం లేకపోవడం అవసరమైన జిల్లా ఆస్పత్రి పాడేరులో ఉన్నందున వైద్య కళాశాల నిర్మాణం అక్కడే చేపట్టింది.

హామీ మేరకు అభివృద్ధి



ప్రతిపక్షనేతగా పాదయాత్ర నిర్వహించినప్పుడు జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఐటీడీఏ పరిధిలోని వైద్యకళాశాల ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చిన తరువాత పాడేరులో వైద్యకళాశాలను ఏర్పాటుకు చేశారు. అలాగే మూడు నియోజకవర్గ కేంద్రాల ప్రజలు ఇబ్బందులను గుర్తించి, పాడేరు జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేస్తే ప్రజలకు మరింత సౌలభ్యం ఉంటుందని పాడేరు కేంద్రంగా జిల్లాను ప్రకటించారు.అరకు నియోజకవర్గ అభివృద్ధికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రాధాన్యత ఇచ్చారు. అరకు నియోజకవర్గానికి అభివృద్ధి, సంక్షేమానికి సీఎం రూ. 3వేల కోట్లు వెచ్చించారు.. ఈనాడు పత్రిక వాస్తవాలు తెలుసుకోకుండా తప్పుడు కథనాలు ప్రచురించడం సరికాదు.

– చెట్టి పాల్గుణ, అరకు ఎమ్మెల్యే

గురుకులాల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్



గురుకులాల్లో ప్రవేశాల నోటిఫికేషన్ కరపత్రాలను విడుదల చేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: మైదాన ప్రాంతాల్లోని గురుకుల విద్యాలయాల్లో ప్రవేశాలకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందని కలెక్టర్ విజయసునీత తెలిపారు. ఈమేరకు నోటిఫికేషన్ ప్రచార కరపత్రాలను మంగళవారం ఆమె తన కార్యాలయంలో ఆవిష్కరించారు. భీమిలి, అచ్యుతాపురం బాలికల గురుకుల విద్యాలయాలు, నర్సీపట్నం బాలుర గురుకుల పాఠశాలలో 5,6,7,8 తరగతుల్లో బ్యాక్‌లాగ్ సీట్లు ఉన్నాయన్నారు.అలాగే విజయనగరం జిల్లా తాటిపూడి గురుకుల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు అల్లూరి జిల్లాలోని విద్యార్థులు కూడా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు పెట్టుకోవచ్చన్నారు. సంబంధిత వెబ్‌సైట్‌లో ఈనెల 31వతేదీ లోగా విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అన్ని తరగతులకు సంబంధించి వచ్చే నెల 25న పాడేరులో ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఆర్‌జేసీ-2024 సమన్వయకర్త సంధ్యాభార్గవి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న పీవో అభిషేక్

అరకులోయ రూరల్: మండలంలోని చొంపి, నందిగుడ, మాడగడ, హట్టగుడ, కినంగుడ, జనంగుడ, బోసుబెడ్డ, పానిరంగిని గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలను పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ మంగళవారం పరిశీలించారు. ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఈ వేణుగోపాల్, తహసీల్దార్ సుధాకర్, ఎంఈవో మోహన్ రావు, ఏటీడబ్ల్యూవో వైకుంఠరావు పాల్గొన్నారు.

వ్యాయామ విద్య అవసరం



సదస్సులో మాట్లాడుతున్న కృష్ణారావు

అడ్డతీగల: పాఠశాలల్లో వ్యాయామ విద్య ఎంతో అవసరమని జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల అసోసియేషన్ అధ్యక్షుడు విండెల కృష్ణారావు అన్నారు.రంపచోడవరం నియోజకవర్గంలోని 11 మండలాల వ్యాయామ ఉపాధ్యాయుల సదస్సును అడ్డతీగలలోని వైటీసీలో మంగళవారం ప్రారంభించారు. మూడు రోజుల పాటు ఈ సదస్సు జరుగుతుందని కృష్ణారావు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మూడు రోజుల సదస్సులో కొత్తగా అమల్లోకి వచ్చిన నియమ నిబంధనలపై అవగాహన కల్పిస్తామన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులకు ఖోఖో, కబడ్డీ, బాడ్మింటన్, వాలీబాల్, త్రోబాల్ పోటీలు నిర్వహిస్తామన్నారు.ఈ సదస్సులో 11 మండలాలకు చెందిన 149 మంది వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్టెల్లా మేరీస్ పాఠశాలకు అనుమతులు లేవు

ఎటపాక: మండలంలోని నెల్లిపాకలో ఉన్న స్టెల్లా మేరీస్ ప్రైవేటు పాఠశాలకు ప్రభుత్వ అనుమతులు లేవని మండల విద్యాశాఖ అధికారి నీలి బాలరాజు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అనుమతులు లేకుండా నడుపుతున్న ఈ పాఠశాలలో పిల్లలను చేర్చవద్దని తల్లిదండ్రులు సూచించారు. ప్రభుత్వ అనుమతి లేకుండా పాఠశాల యాజమాన్యం అడ్మిషన్లు జరిపితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చేయూతతో ఆర్థిక బలోపేతం

- గీతాంజలి ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం
- చంద్రబాబుకు అధికార దాహం తప్ప వేరేమీ లేదు
- పాడేరు ఎమ్మెల్యే కె భాగ్యలక్ష్మి
- కొయ్యూరులో చేయూత చెక్కు పంపిణీ



గీతాంజలి మరణంపై మౌనం పాటిస్తున్న ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నేతలు



చేయూత చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి,పక్కన నేతలు

కొయ్యూరు: చేయూత ఎందరో మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసిందని పాడేరు ఎమ్మెల్యే కె.భాగ్యలక్ష్మి అన్నారు. మంగళవారం ఆమె కొయ్యూరులో నిర్వహించిన చేయూత నిధుల పంపిణీ కార్యక్రమానికి హాజరయ్యారు. సోషల్ మీడియాలో టీడీపీ–జనసేన అసభ్యకర పోస్టుల మూలంగా ఆత్మహత్య చేసుకున్న గీతాంజలి ఆత్మకు శాంతి చేకూరాలని ఆమెతోపాటు సభకు వచ్చిన వారంతా మౌనం పాటించారు.అనంతరం ఆమె మాట్లాడుతూ మండలంలో 3,387 మంది మహిళలకు రూ.6.35 కోట్లు జమ అవుతాయని, ఇందుకు సంబంధించిన నమూనా చెక్కును పంపిణీ చేశారు. నాటి నేటి పాలనకు మధ్య వ్యత్యాసాన్ని చూడాలన్నారు. అసలు విజన్ లేని నాయకుడు చంద్రబాబన్నారు.ఆయనకు అధికార దాహం తప్ప మరేం లేదన్నారు. కంతారంలో గ్రామ సచివాలయ భవనాన్ని ఆమె ప్రారంభించారు.

ఆడాకుల పంచాయతీ కన్నవరంలో రామాలయానికి శంకుస్థాపన చేశారు. నియోజకవర్గానికి 112 అలయాలు మంజూరయ్యాయని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బడుగు రమేష్, జెడ్పీటీసీ వారా నూకరాజు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గాడి నాగమణి, జిల్లా కార్యదర్శి గాడి సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షులు జల్లి బాబులు, చింతపల్లి ఏఎంసీ చైర్మన్ రాజులమ్మ, సచివాలయ కన్వీనర్ సుధాకర్, వైస్ ఎంపీపీలు అంబటి నూకాలు, అప్పన వెంకటరమణ,జిల్లా ఎక్జిక్యూటివ్ సభ్యులు గంగాధర్, సర్పంచ్‌లు పాట్టిక శ్రీను, రీముల శ్రీను,జంపా కన్నయమ్మ పీటా సింహాచలం, వనంబాబు, ఎంపీటీసీలు సద్దా మల్లేశ్వరి,పాడుతురత్నం పాల్గొన్నారు.

99శాతం హామీలు అమలు : రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

కూనవరం: ఎన్నికల హామీలను 99 శాతం అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కిందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్ మైదానంలో మంగళవారం నిర్వహించిన వైఎస్సార్ చేయూత నాలుగో విడత కార్యక్రమంలో కూనవరం, వీఆర్‌పురం, చింతూరు, ఎటపాక మండలాల వైఎస్సార్ చేయూత లబ్ధిదారులు 29,331 మందికి రూ.54.97 కోట్ల విలువైన చెక్కు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. 2019 ఎన్నికల్లో జగన్ మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన తరువాత రూ.13,500 చొప్పున రైతులకు రుణమాఫీ చేశారన్నారు. ఈఐదేళ్లలో రూ.3.80 కోట్లు రైతుల ఖాతాలో జమచేశారన్నారు. డ్వాక్రా అక్క చెల్లెమ్మలకు సుమారు రూ.55 కోట్లు చేయూత ద్వారా అందించామన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ పాయం రంగమ్మ, జెడ్పీటీసీ గుజ్జా విజయ, రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు చిచ్చడి మురళి, మేరుకులం రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ దీకొండ గంగాధర్, కూనవరం, వీఆర్‌పురం, ఎటపాక మండలాల కన్వీనర్లు ఆలూరి కోటేశ్వరరావు, తానికొండ వాసు, మాదిరెడ్డి సత్తిబాబు, చింతూరు వైస్ ఎంపీపీ మేడేమల్లి సుధాకర్, మాజీ వైస్ ఎంపీపీ గుజ్జాబాబు, ఎంపీటీసీ కొమ్మాని అనంత లక్ష్మి, చింతూరు, ఎటపాక జెడ్పీటీసీ ఉబ్బా సుస్మిత, ఎంపీపీలు సవలం అమల, కాక కామేశ్వరి, సొసైటీ అధ్యక్షుడు ఎన్ కొండలరావు, పార్టీ జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు కరక లక్ష్మి పాల్గొన్నారు.

గుణాత్మక విద్య అందించాలి



రెగ్యులర్ అయిన సీఆర్టీకి నియామక పత్రం అందజేస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు : గిరిజన విద్యార్థులకు గుణాత్మకమైన విద్యను అందించాలని ఐటీడీఏ పీవో అభిషేక్ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రెగ్యులర్ అయిన 61 మంది సీఆర్టీలకు స్కూల్ అసిస్టెంట్లుగా నియమిస్తూ మంగళవారం ఐటీడీఏ కార్యాలయం సమావేశ మందిరంలో ఆర్డర్లను అందజేశారు. అంతకు ముందు రెగ్యులర్ అయిన వారితో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం క్రమబద్ధీకరణ చట్టం ప్రకారం అర్హత ఉన్న వారికి రెగ్యులర్ చేస్తుందన్నారు. ఇందుకోసం ఎవ్వరికి కూడా డబ్బులు ఇవ్వొద్దన్నారు. ఐటీడీఏ పరిధిలో ప్రస్తుతం మొదటి విడతలో 61 మంది సీఆర్టీలు రెగ్యులర్ అయ్యారని ఇంకా 16 మంది సీఆర్టీలను రెగ్యులర్ చేయడానికి సర్వీసుల్లో కొంత వ్యత్యాసం ఉందన్నారు. అర్హత ప్రకారం ప్రతి ఒక్కరిని రెగ్యులర్ చేస్తామన్నారు. రెండో విడతలో మరో 100 మంది సీఆర్టీలు రెగ్యులర్ అయ్యే అవకాశం ఉందన్నారు. రెగ్యులర్ అయిన సీఆర్టీల వివరాలు నిధి పోర్టల్‌లో నమోదు చేశామన్నారు. రెగ్యులర్ అయిన వారంతా విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేయాలన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డీడీ కొండలరావు పాల్గొన్నారు.

ఉన్నతి జాబ్‌మేళాకు 45 మంది హాజరు

జి.మాడుగుల: ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించే ఉన్నతి జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో లోహిత్ జయసాగర్ తెలిపారు. మండలంలో ఎంఎస్ఆర్‌ఈజీఎస్ అధ్వర్యంలో మంగళవారం ఉన్నతి జాబ్ మేళా నిర్వహించారు. ఉపాధిహామీ పథకంలో వంద రోజులు పనిదినాలు పూర్తి చేసుకున్న కుటుంబాల్లో చదువుకున్న నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండలంలో 45మంది దరఖాస్తు చేసుకోగా వీరందరి ధ్రువపత్రాలు పరిశీలించారు. ఏపీవోలు కొండబాబు, గంగాధర్, సీడ్ ఏపీ జేసీవోలు శ్యామ్‌సన్, సింహాచలం,శివప్రసాద్ పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: ఎంజీ ఎన్ఆర్‌ఈజీఎస్ ఆధ్వర్యంలో స్థానిక స్త్రీశక్తి భవనంలో మంగళవారం నిర్వహించిన ఉన్నతి జాబ్ మేళాకు వంద మంది నిరుద్యోగ యువతీ యువకులు హాజరయ్యారు. వీరిలో 74 మందిని ఎంపిక చేసినట్టు ఉపాధి ఏపీవో వందే సురేష్‌కుమార్ తెలిపారు. వీరికి అనకాపల్లి, విశాఖపట్నం, అరకులో మూడు నెలల పాటు శిక్షణ ఉంటుందన్నారు. ఉన్నతి జాబ్ కోఆర్డినేటర్ బొజ్జన్న పాల్గొన్నారు.

రాగిపిండి బలవర్ధకమైన ఆహారం

చింతూరు: ఆహార అలవాట్లకు అనుగుణంగా పౌష్టికాహార లోపాలను నిర్మూలించేందుకు బియ్యానికి బదులుగా బలవర్ధకమైన రాగిపిండిని ఉపయోగించాలని చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య మంగళవారం ఓ ప్రకటనలో సూచించారు. ప్రభుత్వం తెల్ల రేషన్ కార్డు దారులకు కేజీ రూ.11 చొప్పున రాగిపిండి అందిస్తోందని, ఈ అవకాశాన్ని ప్రజలంతా వినియోగించుకోవాలని ఆయన తెలిపారు.చింతూరు డివిజన్‌లో ఎటపాక, కూనవరం, వీఆర్‌పురం, చింతూరు మండలాలకు చెందిన తెల్లరేషన్‌దారులు ఈ అవకాశాన్ని సద్వినియోగంచేసుకోవాలని సూచించారు. రాగిమాల్ట్ సేవించడం వల్ల మధుమేహ వ్యాధికి ఔషధంగా పనిచేయడంతో పాటు ఎముకలు, దంతాలు ధృడంగా మారతాయన్నారు.

యువకునికి తీవ్ర గాయాలు

రాజవొమ్మంగి: జడ్డంగి గ్రామ శివారున మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉర్లాకులపాడు కు చెందిన అనిల్‌కుమార్(25) తీవ్రంగా గాయపడ్డాడు. అతను జడ్డంగి నుంచి స్వగ్రామానికి మోటా రు సైకిల్‌పై వెళుతున్న సమయంలో వంతెన ని ర్మాణం కోసం తీసిన గొయ్యిలో పడిపోయాడు. స్థానికులు అతడిని జడ్డంగి పీహెచ్‌సీకి తరలించగా చికిత్స పొందుతున్నట్లు ఎస్సై రఘునాథరావు తెలిపారు.

చెట్టుపై నుంచి జారి పడి వ్యక్తికి..

చెరకుంపాలెం గ్రామానికి చెందిన కతనపల్లి రాధాకృష్ణ తాటిచెట్టుపై నుంచి జారిపడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. సోమవారం ఇక్కడ పొలంలో తాటి చెట్టు ఎక్కి తాటాకు నరుకుతూ ఉండగా, పట్టు జారి పడిపోయాడు. అతడిని జడ్డంగి పీహెచ్‌సీకి తరలించగా ప్రథమ చికిత్స చేశారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు.

తేనె కొనుగోలు

చింతపల్లి రూరల్: గిరిజనులు అడవి నుంచి సేకరించిన తేనెను జీసీసీ ద్వారా కొనుగోలు చేస్తున్నట్టు జీసీసీ డివిజనల్ మేనేజర్ పి.దేవరాజు మంగళవారం తెలిపారు.

రైల్వే అభివృద్ధికి కేంద్రం ప్రత్యేక చొరవ

- కలెక్టర్ విజయ సునీత



స్టాల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయ సునీత

అరకులోయ రూరల్: రైల్వే అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుందని కలెక్టర్ విజయసునీత తెలిపారు. వన్‌స్టేషన్ – వన్ ప్రొడక్ట్‌లో భాగంగా బొర్రా, యండపల్లివలస(అరకు), గోరపూర్ రైల్వే స్టేషన్లలో ఏర్పాటు చేసిన స్టాళ్లు, కోరాపుట్‌లో డబ్లింగ్ రైల్వే లైన్ పనులను వర్చువల్ విధానంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంగళవారం ప్రారంభించారు. దీనిలో భాగంగా యండపల్లివలస (అరకు) రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన శిలాఫలకాలను కలెక్టర్ విజయ సునీత ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైల్వే స్టేషన్లలో ఆధునిక సౌకర్యాలను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. నిత్యావసర, వ్యవసాయ ఉత్పతుల ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న ప్రత్యేక రైల్వే సేవలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైల్వే అధికారులు సీపీవో సూర్యప్రకాష్, టీఆర్‌డీ పండిత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు

- చర్మవ్యాధుల నివారణ లక్ష్యంగా ప్రత్యేక వైద్యశిబిరాలు
- పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్



హుకుంపేట ఆశ్రమ పాఠశాలలో వైద్యపరీక్షలను పర్యవేక్షిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్, డాక్టర్ జమాల్‌బాషా, డాక్టర్ విశ్వామిత్ర

సాక్షి,పాడేరు: పాడేరు ఐటీడీఏ పరిధిలోని అన్ని గిరిజన విద్యాలయాల్లో గిరిజన విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ అన్నారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలు, గురుకుల, ఏకలవ్య, కేజీబీవీ విద్యాలయాల్లో చర్మవ్యాధులతో బాధపడే గిరిజన విద్యార్థులకు వైద్యనిపుణులతో కూడిన ప్రత్యేక వైద్యశిబిరాలకు పాడేరు ఐటీడీఏ శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా తొలిసారిగా హుకుంపేట గిరిజన సంక్షేమ ఇంగ్లీషు మీడియం బాలికల ఆశ్రమ పాఠశాలలో చర్మవ్యాధుల నివారణ ప్రత్యేక వైద్యశిబిరాన్ని పీవో అభిషేక్, డీఎంహెచ్‌వో జమాల్‌బాషా, పాడేరు జిల్లా సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వామిత్ర మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ అన్ని గిరిజన విద్యాలయాల్లో ఈ ప్రత్యేక వైద్యశిబిరాలు విజయవంతానికి జిల్లా ఆస్పత్రి వైద్యనిపుణులతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యబృందాల సేవలను వినియోగించుకుంటామన్నారు. హుకుంపేటతో పాటు పెదగరువు బాలికల ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన ప్రత్యేక వైద్యశిబిరం విజయవంతమైంది. జిల్లా సర్వజన ఆస్పత్రి సూపరింటెండెట్ డాక్టర్ విశ్వామిత్ర పర్యవేక్షణలో వైద్య నిపుణులు డాక్టర్ ఎర్రయ్య, డాక్టర్ లక్ష్మీసరోజిని, డాక్టర్ అబ్దుల్‌బషీర్ తదితరులు రెండు పాఠశాలల్లో 875మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఏటీడబ్ల్యూవో ఎల్,రజని.హెచ్ఎం మీనాకుమారి, హుకుంపేట పీహెచ్‌సీ వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా గంగమ్మతల్లి ఉత్సవాలు



గంగమ్మతల్లికి పూజలు నిర్వహిస్తున్న జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర

ముంచంగిపుట్టు: మండలంలోని పాత,కొత్త సుజనకోట గ్రామాల్లో గంగమ్మతల్లి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. సోమవారం రాత్రి అధిక సంఖ్యలో భక్తులు శతకం పట్టు నుంచి అమ్మవారి ఆలయం వరకు ఘటాలను మోసుకొని వెళ్లి సమర్పించారు. రాత్రి గిరిజన ఆచార సంప్రదాయాల ప్రకారం బుడియాలు సందడి చేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మంగళవారం తెల్లవారు జాము నుంచే అమ్మవారి ఆలయంలో వద్ద భక్తుల రద్దీ పెరిగింది. ఆంధ్ర,ఒడిశా సరిహద్దు గ్రామాల నుంచి అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు పోటెత్తిరు. అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉత్సవ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. స్థానిక ఎస్ఐ రవీంద్ర ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. ముంచంగిపుట్టు కిరాణా వ్యాపారులు గుడ్ల వెంకటరావు,శ్రీనివాసరావు 5వేల మందికి ఉచితంగా ప్రసాదం పంపిణీ చేశారు. ఆంధ్రప్రదేశ్ గిరిజన విలేకరుల సంఘం ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదం పంపిణీచేశారు. జెడ్పీచైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర,అరకు నియోజకవర్గ సమన్వయకర్త రేగం మత్స్యలింగం తదితరులు పాత,కొత్త సుజనకోటలలో గంగమ్మ అమ్మవారిలను దర్శించుకుని చీరలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు.

సీఆర్‌పీఎఫ్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంటు



క్రికెట్ టోర్నమెంటు ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య, గౌరవ అతిథులు

వై.రామవరం: సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలో భాగంగా స్థానిక సీఆర్‌పీఎఫ్ డి42 బెటాలియన్ పోలీసుల ఆధ్వర్యంలో మంగళవారం మండల యువతకు క్రికెట్ టోర్నమెంటు నిర్వహించారు. బెటాలియన్ ఇన్‌స్పెక్టర్ సి.అంబూచ్ జియాన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అడ్డతీగల సీఐ రవికుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని క్రికెట్ టోర్నమెంటును ప్రారంభించారు. ఈ టోర్నమెంటు వారం రోజులపాటు కొనసాగుతుంది. అనంతరం విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేస్తారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథులుగా సర్పంచ్ పల్లాల బాలురెడ్డి, స్థానిక ఎస్ఐ ఎం. సంతోష్ కుమార్, సీహెచ్‌సీ వైద్యాధికారులు చైతన్య కుమార్, పి.సౌమ్య పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

పాడేరు : పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా రోగాలు దరిచేరవని, ఆరోగ్యంగా జీవించవచ్చని ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి తెలిపారు. మండలంలోని గబ్బంగి, గుత్తులపుట్టు అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహించారు. ఆ కార్యక్రమాల్లో ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి పాల్గొని అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారంపై వివరించారు.

మూడు రహదారుల నిర్మాణానికి శంకుస్థాపనలు



తునికిచెరువు వద్ద రహదారి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి

ఎటపాక: మండలంలో మూడు బీటీ రోడ్ల నిర్మాణ పనులకు మంగళవారం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి శంకుస్థాపనలు చేసి, శిలాఫలకాలను ఆవిష్కరించారు. కన్నాయిగూడెం గ్రామ పంచాయతీలోని గుండువారిగూడెం నుంచి కన్నాయిగూడెం వరకు రూ.1.77 కోట్ల అంచనాతో తారురోడ్డు నిర్మాణం పనులు ప్రారంభించారు. తునికిచెరువు నుంచి రాంగోపాలపురం వరకు రూ.4 కోట్లతో బీటీ రహదారి, రూ.1.70 కోట్లతో పండువారిగూడెం నుంచి రాంగోపాలపురం వరకు చేపట్టిన బీటీ రహదారి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ కాక కామేశ్వరి, జెడ్పీటీసీ ఉబ్బా సుస్మిత,ఎంపీటీసీలు వర్స బాలకృష్ణ, బూరం అంజలి, సర్పంచ్‌లు నాగమణి, కామేశ్వరరావు, రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తానికొండ వాసు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మంత్రిప్రగడ నర్సింహారావు, జిల్లా కార్యదర్శి దామెర్ల రేవతి,నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధులపై అవగాహన అవసరం

రంపచోడవరం: కిడ్నీ వ్యాదులపై అందరూ అవగాహన కలిగి ఉండాలని ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ కె.లక్ష్మి తెలిపారు. వరల్డ్ కిడ్నీ డేను పురస్కరించుకుని గిరిజన సంక్షేమ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ పిల్లలు ఎక్కువగా నీళ్లు తాగాలని తెలిపారు. మూత్రం ఎక్కువగా వస్తుంటే ఆస్పత్రికి వెళ్లాలని సూచించారు.ఈ కార్యక్రమంలో హెచ్ఎం ప్రేమ్‌కుమార్, కోఆర్డినేటర్ మనీషాకుమార్‌లు పాల్గొన్నారు.